

చిన్నశంకరంపేట: కామారంలో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని మహిళలను కోరుతున్న జడ్పీటీసీ మాధవి, యాదగిరి యాదవ్



నిజాంపేట: బచ్చురాజ్‌పల్లిలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీపీ సంపత్, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి

# కేసీఆర్.. హ్యాట్రిక్ సీఎం తథ్యం

- తెల్ల రేషన్‌కార్డుదారులకు రూ.5 లక్షల 'కేసీఆర్ బీమా'
- కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు
- రూ.400లకే గ్యాస్ సిలిండర్: జడ్పీటీసీ పట్లోరి మాధవి

చిన్నశంకరంపేట/నిజాంపేట, నవంబర్ 17: కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని, కారు గుర్తుకు ఓటేస్తే తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల 'కేసీఆర్ బీమా' పథకాన్ని బీఆర్ఎస్ పార్టీకి అమలుచేస్తాదని జడ్పీటీసీ పట్లోరి మాధవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కామారం గిరిజన తండాలో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మా దేవేందర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో వివరాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాధవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నది ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనని, ప్రజలందరూ సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని, గ్రామాల్లో ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబానికి సన్నబియ్యం, ప్రతి మహిళకు 'సౌభాగ్య లక్ష్మి'పథకం ద్వారా నెలకు రూ. 3000లు, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కరెంటు కష్టాలు తప్పవన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు విని ప్రజలు మోసపోవద్దన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షే మం కోసం సీఎం కేసీఆర్ కృషి చేశారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతుబీమా, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని గుర్తుచేశారు. ఇప్పటికే పద్మాదేవేందర్ రెడ్డి గెలుపు ఖాయమైందని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్‌కే తెలుపుతున్నారన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజే పీ నేతలకు ప్రజలు గుర్తుకువస్తారని ఎద్దేవా చేశారు. ఇంటింటికీ ఎన్నికల ప్రచారంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పూలపల్లి యాదగిరియాదవ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బాగారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట: కామారం గిరిజన తండాలో బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను గిరిజనులకు వివరిస్తున్న జడ్పీటీసీ మాధవి



నిజాంపేటలో బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగరాజు

## ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతున్నదని మాజీ ఎంపీపీ బిజ్జ సంపత్, బీఆర్ఎస్ నిజాంపేట గ్రామ అధ్యక్షుడు చల్మెటి నాగరాజు అన్నారు. శుక్రవారం వేర్వేరుగా మండలంలోని బచ్చురాజ్‌పల్లి, నిజాంపేట గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వారు ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, డైరెక్టర్ తిరుమల్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశం, ఉప సర్పంచ్ బాబు, వార్డు సభ్యుడు తిరుమల్ గౌడ్, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, నిజాంపేట, నస్కల్ మాజీ సర్పంచులు సత్యనారయణ, అనిత, నాయకులు శ్రీనివాస్, రాములు, తిరుమల్, లక్ష్మీనర్సింహులు, మహేశ్, లక్ష్మణ్, ఎల్లం, కొండల్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

# అక్రమాలపై సీ-విజల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి

- ముమ్మరంగా ఓటరు స్లిప్పులు అందజేత
- 1950 నంబర్‌పై అవగాహన కల్పించాలి: తహసీల్దార్ శ్రీనివాస్



ఓటరు స్లిప్పుతోపాటు, ఓటర్ గైడ్, సీ-విజిల్ కరపత్రాలు పంపిణీని పర్యవేక్షిస్తున్న మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్

మెదక్ రూరల్, నవంబర్ 17: ఓటరు సమాచార స్లిప్పులతో పాటు ఓటరు గైడ్, సీ-విజిల్ కరపత్రాలు ప్రతి ఒక్కరికీ అందించాలని మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శుక్రవారం మెదక్ మండలంలోని వెంకటపూర్, గుట్టకిందిపల్లి, ఖాజీపల్లితోపాటు పలు గ్రామాల్లో బీఎల్వోలు ఓటరు స్లిప్పులు, ఓటరు గైడ్ పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు స్లిప్పులతోపాటు, ఓటరు గైడ్, సీ-విజిల్ కరపత్రలు ప్రతి ఓటరుకు అందించి సీ-విజల్ టోల్ ఫ్రీ నంబర్ 1950పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం బహుమతుల వంటివి ఇచ్చి ప్రలోభాలకు గురి చేసినా ఈ వివరాలను నేరుగా సీ-విజల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఎన్నికల ప్రచారంలో అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్ వాడటం ఇతర నిబంధనలు ఉల్లాఘించిన, కులమతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అనుమతి లేకుండా ర్యాలీలు తీసిన ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు. బీఎల్వోలు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంతెపల్లివాసిమృతి

- హైదరాబాద్‌లోని గాజులరామారంలో ఘటన

రామాయంపేట, నవంబర్ 17: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని గాజులరామారంలో బుధవారం జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతెపల్లి పంచాయతీ బిల్యా తండాకు చెందిన రమావత్ సురేశ్(32) స్వగ్రామం నుంచి బతుకుదెరువు కోసం వెళ్లి హైదరాబాద్‌లోని గాజులరామారంలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని రూమ్‌కు వెళ్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన సురేశ్‌ను దగ్గరలో ఉన్న దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గాజులరామారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

పాపన్నపేట, నవంబర్17: మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన ఓవ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్సపొందుతూ మృతిచెందాడని పాపన్నపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే పాపన్నపేటకు చెందిన జంగంపల్లి నర్సింలు (34) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతడి తల్లి రామమ్మ మార్కెట్ నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి కుమారుడు అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే అతడిని మెదక్ ఏరియా ప్రభుత్వ దవాఖానకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 16వ తేదీ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి వెల్లడించారు.



అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మద్దతుగా ఓటర్లకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఆయన సతీమణి పద్మావతి

## ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సతీమణి ప్రచారం

రేగోడ్, నవంబర్ 17: మండలంలోని చౌదరపల్లిలో శుక్రవారం అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్ సతీమణి పద్మావతి ఇంటింటి ప్రచారంలో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ అందించిన పథకాలను వివరించారు. గడపగడకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో సర్పంచ్ కళావతి, గ్రామ బీఆర్ఎస్ నాయకులు సాయిలు, సురేందర్, జైపాల్, ఉప సర్పంచ్ దుర్గమ్మ, వార్డు మెంబర్లు జనార్దన్, ప్రవీణ్, మండల నాయకులు రమేశ్, ఎంపీటీసీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఒకేషనల్ విద్యార్థులకు ఎలక్ట్రికల్‌లో శిక్షణ ఇస్తున్న లెక్చరర్లు

## చదువుతోపాటు ఆన్ జాబ్ శిక్షణ

రామాయంపేట, నవంబర్ 17: విద్యార్థులు చదువుతో పాటు ఒకేషనల్ కోర్సులో ఆన్ జాబ్ శిక్షణను అలవర్చుకోవాలని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గూడూరి మల్లేశం సూచించారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు ఎలక్ట్రికల్ దుకాణాల్లో శిక్షణను అందించారు. ప్రతి విద్యార్థి శ్రద్ధతో ఆన్ జాబ్ శిక్షణను పూర్తి చేస్తే ప్రభుత్వ సెక్టార్లలో సైతం ఉపాధిని సులభంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలప్రకాశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.